రిజర్వేషన్లు

కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఐఐటీలు, ఐఐఎంలు, ఏఐఐ ఎంఎస్(ఎయిమ్స్)వంటి ఉన్నత విద్యాసంస్థల్లో.. వెనుకబడిన తరగతుల వారికి(ఓబీసీలు) 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ... యూ పీఏ సర్కారు చేసిన చట్టం రాజ్యాంగ బద్ధమేనని సుప్రీంకోర్టు ఏప్రిల్ 10న తీర్పు చెప్పింది. దాంతో రెండేళ్లుగా కొనసాగుతున్న ఈ వివాదా నికి తెరపడినట్లయింది.

కేంద్రీయ విద్యాసంస్థల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ.. 2006, మేలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం కేంద్రీయ విద్యాసంస్థల (ప్రవేశాల్లో రిజర్వేషన్)చట్టం చేసింది. దానిపై అప్పట్లో వ్యతిరేకత వచ్చింది. కోటాలపై ప్రభుత్వ నిర్ణయం వెనుక కారణాలు, నేపథ్యాన్ని ఒకసారి పరిశీలిస్తే... స్వాతంత్ర్యం రాకమునుపే బ్రిటిష్ వారి పాలనలో హిందూసమాజంలోని అనేక కులాలవారికి ఉద్యోగాలు, విద్యాసం స్థల్లో రిజర్వేషన్లు ఉండేవి. 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చాక... కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ కులాలు, తెగల వారికి(ఎస్సీ, ఎస్టీలు) మాత్రమే రిజర్వేషన్లు కల్పిం చారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే స్వేచ్ఛను అప్పటి నెహ్రూ ప్రభుత్వం ఆయా రాష్ట్ర సర్కార్లకు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో బీసీలకు కోటా ఇచ్చే ప్రతిపాదనను వాయి దా వేసింది. ఈ విషయంపై కేంద్రం 1950ల్లో కాకా కాలేల్కర్ అధ్యక్షతన మొదటి బీసీ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ నివేదిక ఇవ్వకుండానే పని ముగించింది.

మండల్ కమిషన్:

1977లో జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక బీహార్ మాజీ ముఖ్య మంత్రి బి.పి.మండల్ అధ్యక్షతన రెండో బీసీ కమిషన్‌ను నియమిం చింది. ఇదే ఆ తర్వాత మండల్ కమిషన్‌గా ప్రచారంలోకి వచ్చింది. కేంద్రప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో బీసీలకు 27 శాతం కోటా ఇవ్వడం వంటి పలు సిఫార్సులతో మండల్ కమిషన్ తన నివేదిక సమర్పించింది. ఈ నివేదికను అమలు చేయాలనే డిమాండు అప్పట్లో పెద్దగా వినిపించలేదు. 1989 డిసెంబర్‌లో కేంద్రంలో విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ నేతృత్వంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఈ సంకీర్ణ సర్కారుకు జనతాదళ్ నేతృత్వం వహించింది. జనతాదళ్‌లో కీచులాటల ఫలితంగా.. మండల్ నివేదికలోని ఒకే ఒక సిఫారసును అమలుచేయాలని 1990లో వి.పి.సింగ్ నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ శాఖలు, కేంద్రప్రభుత్వరంగ సంస్థల్లోని ఉద్యోగాల్లో బీసీలకు 27 శాతం కోటా కల్పిస్తూ వి.పి.సింగ్ ప్రభుత్వంఉత్తర్వులు జారీచేసింది. దీనిపై దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాదిన తీవ్ర వ్యతి రేకత వ్యక్తమయింది. వేలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చారు. దాంతో కేంద్రీయ విద్యాసంస్థల్లో సైతం బీసీలకు కోటా కల్పించాల నుకున్న వీపీసింగ్ వెనకడుగు వేశారు. చివరికి ఈ రిజర్వేషన్ వ్యవ హారం సుప్రీంకోర్టుకు చేరింది.

సబబేనన్న సుప్రీం:

కేంద్రప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం బీసీ కోటా సబబేనని 1992లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పడంతో మండల్ మంటలు చల్లారాయి. 2004లో కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలో యూపీఏ సర్కారు అధికారంలోకి వచ్చాక.. మానవవనరుల శాఖ మంత్రి అర్జున్‌సింగ్ చొరవతో ఐఐటీలు, ఐఐఎంలు వంటి కేంద్రీయ విద్యాసంస్థల్లో ఓబీసీలకు కోటా ఇవ్వాలన్న ప్రతిపాదన ముందుకొచ్చింది. దీని అమలుపై వీరప్పమొయిలీ అధ్యక్షతన కమిటీ నియమించారు. ఈ విద్యాసంస్థల్లో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 22.5 శాతం (15+7.5) కోటా ఉంది. దాంతో జనరల్ కేటగిరీ విద్యార్థులు నష్టపోకుండా సీట్ల సంఖ్యను క్రమేణా 54శాతం పెంచాలని నిర్ణయిస్తూ.. కేంద్రం, 93వ రాజ్యాంగ సవరణ చట్టం చేసింది. దీన్ని సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై ప్రధానన్యాయమూర్తి కె.జి.బాలకృష్ణన్, న్యాయమూర్తులు అరిజిత్ పసాయత్, సి.కె.ఠక్కర్, ఆర్వీ రవీంద్రన్, దల్వీర్ భండా రీలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఓబీసీ కోటాకు అనుకూలంగా తీర్పు ఇస్తూనే... సంపన్న శ్రేణి (క్రీమీలే యర్)ని రిజర్వేషన్ పరిధి నుంచి మినహాయించాలని ఆదేశించింది.

సంపన్న శ్రేణిపై చర్చ:

సుప్రీంకోర్టు తాజా తీర్పుతోఇప్పుడు చర్చ క్రీమీలేయర్‌పైకి మళ్లింది. వార్షికాదాయం రూ.2.5లక్షల దాటిన వారందరినీ సంపన్నులుగా పరిగణించడం అన్యాయమనే వాదన తెరపైకి వచ్చింది. ఆదాయ పరిమితిని ఐదు లక్షలకు పెంచే విషయం పరిశీలిస్తామని అర్జున్‌సింగ్ ప్రకటించారు. అంటరానితనం, సాంఘికవివక్ష వంటి సమస్యలను ఓబీసీలు ఎదుర్కొన్నారని... ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధించే వారిలో ఈ వర్గం విద్యార్థులు స్వల్పంగా ఉన్నకారణంగానే కోటా కల్పించినట్టు యూపీఏ పేర్కొంది. ప్రజాతంత్ర వ్యవస్థలో అన్ని సామాజిక వర్గాలకు సమానావకాశాలు ఉండాలనే సమానత్వ సూత్రానికి అనుగుణంగానే ఓబీసీ కోటా ఉందని చెప్పవచ్చు. అయితే, ఉద్యోగాల్లోగాని, విద్యాసంస్థల్లోగాని కోటా అనేది అన్ని వర్గాలకు అవకాశం ఇచ్చే సాధనమేగాని, దారిద్ర్య నిర్మూలన పథకం కాదనే అవగాహన అవసరం. సుప్రీంకోర్టు సూచించినట్లు ఇలాంటి వాటిని ప్రతి ఐదేళ్లకు ఒకసారి సమీక్షించడం మేలు!!